ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 4 ఆగస్టు 2025



భక్తితోనే మోక్ష ప్రాప్తి

- 'ప్రవచన సార్వభౌమ' చాగంటి కోటేశ్వరరావు
- ముగిసిన ప్రవచనాలు



సభకు హాజరైన తెలుగు వారు



ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మోక్షాన్ని సంపాదించుకోవడం భక్తి వల్లే సాధ్యమవుతుందని, ముక్తి-మోక్షం ఒకటేనని, భాగవతంలో భక్తి-ముక్తి గురించి తెలిపే అంశాలెన్నో ఉన్నాయని 'ప్రవచన సార్వభౌమ' చాగంటి కోటేశ్వరరావు' పేర్కొన్నారు. భారతీయతా వాహిని చెన్నై ఆధ్వర్యంలో చెట్‌పేట్ లోని కుశలాంబాళ్ కల్యాణమహల్‌లో 'భక్తి - ముక్తి' అనే అంశంపై చాగంటి కోటేశ్వరరావు రెండురోజుల ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. పెద్ద సంఖ్యలో హాజరైన తెలుగువారి మధ్య ఆయన ప్రవచిస్తూ రాజధాని నగరం చెన్నై, శివారు ప్రాంతాల్లో నివస్తున్న తెలుగువారిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు రెండ్రోజుల ప్రవచన కార్యక్రమాన్ని ఎంతో వ్యయ ప్రయాసలతో భారతీయతా వాహిని నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఎన్ని జన్మలెత్తినా భగవంతునిలో ఐక్యం చేసే సేవా కార్యక్రమాలుండాలని, ఏకాదశి పర్వదినాన ఉపవాసం చేయడం సత్ఫలితాలను ఇస్తుందన్నారు. స్థలాన్ని ఆశ్రమాన్ని బట్టి ధర్మం మారుతుందని, శాస్త్రం ప్రతిపాదించిన అంశాన్నే ఇలాంటి సభల్లో మాట్లాడటం ధర్మమన్నారు. సృష్టిలో మనిషి పుట్టుక అత్యంత విలువైందని, ఇది ఈశ్వర అనుగ్రహమన్నారు. జనన-మరణాలకు ముహూర్తం లేదని, వచ్చిన స్థలం, వెళ్ళాల్సిన స్థల వివరాలు ముందే తెలియవని, అందువల్ల ప్రతి మనిషి భక్తి మార్గాన్ని అనుసరించి ముక్తిమార్గంలో పయనించాలని ఆయన హితవు పలికారు. అమ్మ పాడే జోలపాటలో వేదాంతం ఉంటుందని, లలిత కళలు మనిషిలోని భావాలను భగవంతుడి దగ్గరకు తీసుకెళ్తాయని, ఉపాసన సిద్ధి కలిగిన వారిలో భగవంతుడి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ప్రవచనానికి ముందుగా టీటీడీ చెన్నై వేదపండితుల వేద పారాయణం, నర్తకి అర్చన లలితా పరమేశ్వరులకు నీరాజనం పలుకుతూ చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

బీజేపీతో పొత్తుపై

అన్నాడీఎంకే శ్రేణుల్లో విరక్తి

అనువుగానిచోట ఉంటూ ఊరూరా అబద్ధాలు

ఈపీఎస్‌పై సీఎం స్టాలిన్ ధ్వజం



స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలై వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, మేయర్ తదితరులు

అడయార్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలంతా బీజేపీతో పెట్టుకున్న పొత్తును ఏమాత్రం హర్షించడం లేదని, అన్నాడీఎంకే శ్రేణులు సైతం ఆ పొత్తు నచ్చక అయోమయంలో ఉన్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి అనువుగాని చోట ఉంటూ ఊరూరా తిరుగుతూ డీఎంకే ద్రావిడ తరహా పాలనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 6న మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన పార్టీ శ్రేణులకు ఓ లేఖ రాశారు. ఈపీఎస్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్ళి బీజేపీ పెద్దలతో కాళ్లబేరానికి వచ్చి ఆ పార్టీతో పొత్తు కుదుర్చుకోవడాన్ని పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు ఏ మాత్రం సహించలేకపోతున్నారని తెలిపారు. డీఎంకే ద్రావిడ తరహా పాలనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక అన్ని పార్టీల కంటే ముందుగా పర్యటన ప్రారంభించిన ఈపీఎస్ ప్రతి సభలోనూ తమ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోయడం ఆనవాయితీగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్త ంచేశారు. ఇక ఈ నెల 6న కరుణానిధి వర్ధంతి సందర్భంగా మెరీనాబీచ్‌లో ఆయన సమాధి వరకు నిర్వహించనున్న మౌన ర్యాలీలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

నేడు విన్‌ఫాస్ట్ కార్ల ఫ్యాక్టరీ ప్రారంభం...

తూత్తుకుడి విన్‌ఫాస్ట్ కార్ల ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ప్రారంభించనున్నారు. ఆ కార్యక్రమం కోసం సీఎం స్టాలిన్ సోమవారం ఉదయం చెన్నై నుంచి తూత్తుకుడికి విమానంలో వెళ్ళనున్నారు.

నగరంలో 17 యేళ్ల తర్వాత

మళ్లీ డబుల్ డెక్కర్ బస్సులు



ఎంటీసీ సంస్థ విడుదల చేసిన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు నమూనా చిత్రం

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో 17 యేళ్ల తర్వాత డబుల్ డెక్కర్ సిటీ బస్సులు పరుగులు తీయనున్నాయి. ఐదున్నర దశాబ్దాల క్రితం మహానగర రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఎరుపురంగు పల్లవన్ బస్సులు తిరుగుతుండేవి. ఆ బస్సులకు తోడుగా నగరానికే ప్రత్యేక ఆకర్షణగా డబుల్ డెక్కర్ బస్సులు కూడా నడుపుతుండేవారు. కోల్‌కతా, ఢిల్లీ, ముంబయి నగరాల్లో డబుల్ డెక్కర్ బస్సులు తిరుగుతున్న కాలంలో 1970లో తొలిసారిగా చెన్నైలో డబుల్ డెక్కర్ బస్సులను ప్రవేశపెట్టారు. ఈ డబుల్ డెక్కర్ బస్సులు ఎల్లవ్వుడు నిలిచేందుకు కూడా తావులేని విధంగా ప్రయాణికులతో నిండుగా వెళ్తుండేవి. ఈ బస్సు పై అంతస్థులో కూర్చుని ప్రయాణికులు నగర అందాలను వీక్షించేవారు. ఈ పల్లవన్ సర్వీసు డబుల్ డెక్కర్ బస్సులు (అప్పట్లో మహానగర రవాణా సంస్థ బస్సులు పల్లవరాజులను స్మరించుకునేలా పల్లవన్ అనే పేరుతో ఎరుపురంగులో ఉండేవి) పదేళ్లపాటు నగరవాసులకు సేవలందించి 1980లో విశ్రాంతి తీసుకున్నాయి. ఆ తర్వాత మళ్లీ 1997 నుండి డబుల్ డెక్కర్ బస్సులు నడిచాయి. ఈ బస్సులు కూడా పదేళ్లపాటు కీలక ప్రాంతాల్లో నడిచి ఆగిపోయాయి. 2008లో హైకోర్టు - తాంబరం మధ్య నడిచిన డబుల్ డెక్కర్ ఎంటీసీ బస్సు సేవలకు స్వస్తి పలికింది. అప్పటి నుండి నగరంలో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సులు నడపాలని నగరవాసులు, నగర ప్రేమికులు కోరుతూనే ఉన్నారు. ప్రస్తుతం నగరంలో డబుల్ డెకర్ బస్సుల్లా ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు, ఆమ్నీ బస్సులు స్లీపింగ్ బెర్తులతో నడుస్తుండటంతో ఈ బస్సుల ఎత్తు ఇంచుమించు గతంలో నడిపిన డబుల్ డెకర్ బస్సుల ఎత్తుతోనే ఉండటం వల్ల ప్రభుత్వం డబుల్ డెక్కర్ బస్సులు నడిపేందుకు ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదట ప్రయోగాత్మకంగా 20 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను నడపాలని మహానగర రవాణా సంస్థ (ఎంటీసీ) నిర్ణయించింది. ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణించే రూట్లలో నడుపుతామని ఆ సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ యేడాది డిసెంబర్‌లోగా ఈ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు.

ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- 11 జిల్లాలకు భారీ వర్ష సూచన

అడయార్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కోస్తాతీర ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు మరింత బలపడ్డాయి. ఈ కారణంగా ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించగా, మరో 11 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. వచ్చే 24 గంటల్లో కోయంబత్తూరు జిల్లాలోని కొండ ప్రాంతాల్లో, నీలగిరి, కడలూరు, కళ్ళకుర్చి, మైలాడుదుర్రై జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదేవిధంగా తేని, తెన్‌కాశి, సేలం, విల్లుపురం, తిరువణ్ణామలై, అరియలూరు, పెరంబూరు, నాగపట్టణం, తంజావూరు, తిరువారూర్, పుదుక్కోట జిల్లాలతో పుదుచ్చేరి, కారైక్కాల్ విషయంలో భారీ వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. గత 24 గంటల్లో గరిష్టంగా పుదుక్కోటలో మూడు గంటల్లో 14 సెంటీమీటర్లు, తిరుమయంలో 12 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. చెన్నై నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడుతుందని, కోస్తాతీర ప్రాంతంలో ఈదురుగాలుల గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మధ్యలో 60 కిలోమీటర్ల మేరకు వీయొచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

ఈడీ పేరు చెబితేనే

మంత్రులకు భయం

- డీఎంకే ప్రభుత్వంపై ఈపీఎస్ ధ్వజం



ధీరన్ చిన్నమలై చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడి పెద్దమొత్తంలో డబ్బు సంపాదించిన రాష్ట్ర మంత్రులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి భయపడి కంటిమీద కునుకులేకుండా వణికిపోతున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంలో ఆయన చేపట్టిన పర్యటన ఆదివారం తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూర్, శ్రీవైకుంఠం నియోజకవర్గాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆ ప్రాంతాల్లో రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ డీఎంకే పాలనలో ప్రజలు అన్ని విధాలా కష్టాలు ఎదుర్కొంటున్నారని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కారణంగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కార్మికుల వరకు ప్రతి రోజు డీఎంకేకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసమే తాను బీజేపీ కూటమిలో చేరామని, ఆ కూటమిలో ఉన్నప్పటికీ అన్నాడీఎంకే సిద్ధాంతాలను ఎన్నడూ ఉల్లంఘించలేదన్నారు. అన్నాడీఎంకేలో ప్రాథమిక సభ్యుడి నుండి కార్యకర్త వరకు ఉన్నత పదవుల్లో ఉంటారని, అయితే డీఎంకేలో మాత్రం కరుణానిధి కుటుంబ సభ్యులు మాత్రమే పార్టీలో, ప్రభుత్వంలో ఆధిక్యం చూపుతున్నారని, ఈ కుటుంబ పాలన వల్ల రాష్ట్రప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత ప్రజలకు సుభీక్షమైన పాలన అందించి చరిత్రలో నిలిచిపోయారని, వారు 17 ప్రజా ఆస్పత్రులను ప్రారంభించగా, ఈ డీఎంకే 50 నెలల పాలనలో కనీసం ఒక్క వైద్య కళాశాల కూడా తీసుకురాలేదని, దీనిపై సీఎం స్టాలిన్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ పరిపాలన సాగించి పలు జాతీయ పురస్కారాలు పొందిన ఏకైక పార్టీ అన్నాడీఎంకే అనే వాస్తవాన్ని డీఎంకే మర్చిపోయి చీకటి పాలనని విమర్శించడం సబబు కాదన్నారు.

109 రకాలతో విందు...

తిరునల్వేలిలోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఇంట్లో ఆదివారం రాత్రి 109 రకాల వంటలతో ఏర్పాటు చేసిన విందుకు ఈపీఎస్ హాజరయ్యారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలోకి అన్నాడీఎంకే చేరిన విషయం అందరికీ తెలిసిందే. ఆ రెండు పార్టీల మధ్య పెరిగిన సఖ్యత, బలాన్ని నిరూపించుకునే విధంగా నయినార్ నాగేంద్రన్ ఈ విందు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు పార్టీల నాయకులు, తిరునల్వేలి జిల్లా నిర్వాహకులు పాల్గొన్నారు. విందులో పాల్గొన్న ఈపీఎస్‌తో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని గెలిపించేందుకు చేపట్టాల్సిన ప్రచార వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకాలపై నయినార్ నాగేంద్రన్ ఈపీఎ్‌ఎతో చర్చించినట్లు సమాచారం.

కోవైలో ధోనీకి ఘనస్వాగతం



కోవై విమానాశ్రయంలో ధోని

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌కు వచ్చిన క్రికెటర్ ధోనీకి అభిమానులు ఘనస్వాగతం పలికారు. క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని ఆదివారం కోయంబత్తూర్‌లో జరిగిన ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. విమానాశ్రయంలో పెద్దఎత్తున గుమిగూడిన అభిమానులు 'మహీ', 'తల్ ధోని' అంటూ నినాదాలు చేశారు. కొందరు అభిమానులు ధోనీతో సెల్ఫీ తీసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని, ధోనిని కారులో పంపించారు.

సర్వసభ్య మండలికి

రాందాస్,అన్బుమణి ఆహ్వానం

- అయోమయంలో పీఎంకే శ్రేణులు

అడయార్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆయన తనయుడు, పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి వేర్వేరు తేదీల్లో సర్వసభ్యమండలి సమావేశం జరుగుతుందని ప్రకటించడంతో ఏ సభకు వెళ్ళాలో తెలియక పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డారు. పార్టీ శ్రేణులంతా తండ్రికొడుకులు ఐకమత్యంగా పార్టీని నడపాలని కోరుకుంటున్నారు. ఏ సభకు వెళితే ఎవరి ఆగ్రహానికి గురవుతామోనని ఆందోళన చెందుతున్నారు. ఓ వర్గాన్ని విడిచి మరో వర్గం జరిపే సర్వసభ్యమండలి సమావేశంలో పాల్గొంటే ఆ తర్వాత తండ్రీకొడుకులు ఒక్కటయితే తమ పరిస్థితి ఏమవుతుందోనని కూడా వణికిపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ తండ్రీకొడుకుల మధ్య ప్రస్తుతం ఆధిపత్యపోరు తారాస్థాయికి చేరుకుంది. గత ఆరు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ కారణంగా ఆ పార్టీ కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17న పీఎంకే సర్వసభ్యమండలి సమావేశం నిర్వహించనున్నట్టు డాక్టర్ రాందాస్ వెల్లడించారు. వెంటనే తండ్రికి పోటీగా డాక్టర్ అన్బుమణి కూడా 9న సర్వసభ్యమండలి సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఇది పార్టీ నేతలతో పాటు కార్యకర్తల్లో కూడా గందరగోళానికి గురిచేసింది. అదేసమయంలో ఈ నెల 10న పూంపుహార్‌లో పీఎంకే మహిళా విభాగం సమావేశానికి కూడా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తండ్రీ తనయులు వేర్వేరుగా సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంతో పీఎంకే శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.

అడవుల్లో పశువుల మేతకు అనుమతించాలంటూ

సీమాన్ వినూత్న నిరసన



పశువుల కాపర్లతో వెళ్తున్న సీమాన్



ర్యాలీ కోసం తరలించిన పశువులు, - రహదారిలో పోలీసు బందోబస్తు (ఇన్‌సెట్‌లో)

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడినాయకనూరు సమీపంలోని అడవుపారై వద్ద నామ్‌తమిళర్ కట్చి నాయకుడు సీమన్, స్థానిక రైతులతో కలిసి పోలీసు ఆంక్షలను అధిగమించి ఆదివారం మధ్యాహ్నం వేల సంఖ్యలో పశువులను మేతకు తోలుకెళ్ళారు. ఆ ప్రాంతంలో ప్రధాన పశువుల కాపరిని పసుపురంగు శాలువతో సత్కరించి, పసుపురంగు తలపాగా కట్టి, వందలాదిమంది పార్టీ శ్రేణులు వెంటరాగా సీమాన్ నిరసన ర్యాలీ జరిపారు. ఇటీవల తేని జిల్లా కరడుపట్టికి చెందిన ఓ రైతు తన పశువులను అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లగా అటవీశాఖ సిబ్బంది ఆయనపై దాడి జరిపారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో సీమాన్ ఆ ఘటనను ఖండిస్తూ కొద్ది రోజుల క్రితం మదురై సమీపంలో పశువులు, మేకలను తెచ్చి ఓ సమావేశం ఏర్పాటు చేశారు. అడవుల్లో పశువులను మేతకు అనుమతించాలని కోరుతూ అడవుపారై వద్ద ఆగస్టు 3న ర్యాలీ జరుపుతామని ప్రకటించారు. తేని జిల్లా పోలీసులు,అటవీ శాఖ అధికారులు ర్యాలీకి అనుమతివ్వలేదు. ఈ నేపథ్యంలో తేని జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వేల సంఖ్యలో పశువులను అడవుపారైకి తీసుకొచ్చారు. సుమారు రెండు వందల మంది పోలీసులు ఆ ర్యాలీని అడ్డుకునేందుకు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టారు. రైతులు, పశువుల కాపర్లను వెంటబెట్టుకుని అడవుపారై ప్రాంతానికి చేరుకున్న సీమాన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. అయినా సీమాన్ పట్టు విడవక రైతులు, పశువుల కాపరులతో పశువులను అడవుల వైపు సుమారు కిలోమీటరు వరకు తోలుకెళ్ళారు. పోలీసులు ప్రదర్శనను అడ్డుకోవడంతో సీమాన్ తదితర నాయకులు ఆందోళన విరమించుకున్నారు. ఈ సందర్భంగా సీమాన్ మాట్లాడుతూ మేకలు, పశువులకు కూడా ఓటు హక్కు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

చెన్నైలో 45 చోట్ల

'ముదల్వర్ పడైప్పగంగళ్'

- మంత్రి శేఖర్‌బాబు



భూమి పూజ చేస్తున్న మంత్రి పీకే శేఖర్ బాబు, మేయర్ ప్రియ తదితరులు

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో 45 చోట్ల 'ముదల్వర్ పడైప్పగంగళ్' ఏర్పాటు చేయనున్నట్టు సీడీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. ఆదివారం పుళియంతోపు వెంకటేశపురంలో ముదల్వర్ పడైప్పగంకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను యూపీఎస్సీ, టీఎన్పీసీ తదితర పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు రాజధాని నగరంలో 45 చోట్ల 'ముదల్వర్ పడైప్పగంగళ్' (సీఎం సృజనాత్మక కేంద్రాలు) ఏర్పా టు చేసేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారని, ఇప్పటికే రూ.268 కోట్లతో 26 పడైప్పగంగళ్ పనిచేస్తున్నాయని మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. సీఎండీఏ ఆధ్వర్యంలో 30, జీసీసీ తరపున 15 చొప్పున ముదల్వర్ పడైప్పగంగళల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సీఎండీఏ ఆధ్వర్యంలో ఓట్టేరి, సుబ్బురాయన్ వీధి, పట్టాలం, భక్తవత్సలం పార్కు, పుళియంతోపు, వెంకటేశపురం న్యూ కాలనీ, మంగళాపురంలో ఈ కేంద్రాల ఏర్పాటుకు భూమిపూజ జరిపినట్లు చెప్పారు. ఇదే విధంగా పెరంబూరు జమాలియా, మంగళాపురం, ఏకాంగిపురం కార్పొరేషన్ మాధ్యమిక పాఠశాలల్లో అభివృద్ధిపనులకు కూడా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

సమాచార దర్శిని

విద్యుత్ వాహనాలకు 'లోగో' పోటీలు

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్, ఐటీడీపీ ఇండియా, 'మెట్రా స్టార్స్' విద్యుత్ వాహనాలకు ఏకీకృత 'లోగో' రూపొందించేలా 'బ్రాండింగ్ ఆఫ్ స్టేట్ ఎలక్ట్రిక్ వెహికల్ స్కీమ్' పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ఉత్తమ లోగో రూపొందించిన వారికి మొదటి బహుమతిగా రూ. లక్ష, రెండవ బహుమతిగా రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు అందించనున్నారు. విద్యార్థులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, సృజనాత్మక సంస్థలు ఈ పోటీల్లో పాల్గొని, తాము రూపొందించిన లోగోను ఈ నెల 22వ తేది లోగా పంపించాలి. విజేతలకు సెప్టెంబరు 4న ప్రకటించనున్నారు. మరిన్ని వివరాలకు 'గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్' వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

రూ.2 కోట్లతో బస్ షెల్టర్ల పునరుద్ధరణ

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని తండయార్‌పేట, కోడంబాక్కం, అడయార్ మండలాల్లో ఉన్న బస్ షెల్టర్లను రూ.2 కోట్లతో పునరుద్ధరించనున్నారు. తండయార్‌పేట పరిధిలోని ఆర్కే నగర్ కార్పొరేషన్ స్థలంలో రూ.1.79 కోట్లతో బస్ షెల్టర్ నిర్మించనున్నారు. కోడంబాక్కం మండలంలోని వెస్ట్ సైదాపేట జోన్స్ రోడ్డు సమీపంలోని బస్ షెల్టరును రూ.10.5 లక్షలతో పునరుద్ధరించనున్నారు. అడయార్ మండలంలో ఈశ్వరన్ ఆలయం, గోఖలే రోడ్డు ప్రాంతాల్లో దెబ్బతిన్న రెండు బస్ షెల్టర్లను పునరుద్ధంచనున్నట్లు కార్పొరేషన్ తెలిపింది.

70 పార్కుల్లో మినీ లైబ్రరీలు

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో పఠనా నైపుణ్యం పెంపొందించేలా పార్కుల్లో మినీ గ్రంథాలయాలు ఏర్పాటుచేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. తొలివిడతగా రాయపురం మండలం చూలై ఏబీ రోడ్డులోని రాఘువేంద్ర పార్క్, చింతాద్రిపేటలోని మే పార్క్‌ల్లో ఏర్పాటుచేసిన మినీ లైబ్రరీలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. రెండవ విడతలో ప్రజలు అధికంగా వచ్చే 70 పార్క్‌ల్లో మినీ లైబ్రరీలు ఏర్పాటుచేయనున్నట్లు కార్పొరేషన్ ప్రకటించింది.

అద్దె ప్రాతిపదికన 477 నీటి పంపింగ్ ట్రాక్టర్లు

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా రూ.30 కోట్ల అద్దెకు 477 నీటి పంపింగ్ ట్రాక్టర్లు తీసుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. ఈశాన్య రుతుపవన వర్షాలతో నగరం పలు మార్లు ముంపునకు గురైంది. ముంపు ప్రాంతాల్లో చేరిన నీటిని సత్వరం తొలగించేలా పంపింగ్ ట్రాక్టర్లు వినియోగించారు. ఈ క్రమంలో, ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ముందస్తు చర్యల్లో భాగంగా నగరం, శివారు ప్రాంతాల్లో గుర్తించిన ముంపు ప్రాంతాల్లో 477 పంపింగ్ ట్రాక్టర్లు వినియోగించనున్నారు. ఈ ట్రాక్టర్లు సెప్టెంబరు 15 నుంచి జూన్ 14వ తేది వరకు అద్దెకు తీసుకునేందుకు జీసీసీ టెండర్లు ఆహ్వానించింది. ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.1.60 లక్షలు (డీజిల్ ఖర్చులు కలిపి) నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'ఫ్లాగ్ మార్చ్' కమిటీ

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకంతో ర్యాలీ సహా పలు కార్యక్రమాల నిర్వహణకు బీజేపీ కమిటీ ఏర్పాటుచేసింది. బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లుగా రానున్న స్వాతంత్ర్య దినోత్సవం రోజున పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆ ప్రకారం, ఫ్లాగ్ మార్చ్, ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం ఎగురవేయడం సహా పలు కార్యక్రమాలు ఈ నెల 10 నుంచి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలను ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ పర్యవేక్షిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు.

234 నియోజకవర్గాల్లో ఆమ్ ఆద్మీ పోటీ

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 234 నియోజకవర్గాల్లో పోటీచేస్తామని ఆమ్ ఆద్మీ రాష్ట్ర ఇన్‌చార్జి పంకజ్‌సింగ్ తెలిపారు. రాయపురం తూర్పు కల్యాణ మండపం రోడ్డులో శనివారం రాత్రి ఆ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వశీకరన్ మాట్లాడుతూ... అవినీతి నిర్మూలించాలనే నినాదంతో పార్టీ ప్రారంభించిన ఏడాదిలోపే ఢిల్లీలో అధికారం చేపట్టామన్నారు. బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా, కేసులు బనాయించినా పార్టీ ఎలాంటి ఒడిదుడుకులకు లోనుకాలేదని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆమ్ ఆద్మీని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 234 నియోజకవర్గాల్లో పోటీచేస్తామని ఆయన తెలిపారు.

బీజేపీ అధిష్ఠానం ఓపీఎస్‌తో చర్చించాలి

- టీటీవీ దినకరన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి నుంచి ఒ.పన్నీర్‌సెల్వం వైదొలగడం ఆవేదన కలిగిస్తుందని, కూటమిలో కొనసాగేలా పన్నీర్‌సెల్వంతో బీజేపీ అధిష్ఠానం చర్చించాలని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కూటమి నుంచి వైదొలిగేలా ఓపీఎస్‌పై నిర్బంధం వచ్చిందన్నారు. ఆయన కూటమి నుంచి వైదొలగడం బాధకరమన్నారు. ఢిల్లీ అధిష్ఠానం ఓపీఎస్‌తో చర్చిస్తే, ఆయన తన నిర్ణయం మార్చుకునే అవకాశముందని తెలిపారు. ఈ విషయమై తాను ఓపీఎస్‌ను సంప్రదిస్తున్నామన్నారు. ఎన్డీఏ కూటమిలో ఏఎంఎంకే ఉందా? లేదా? అనే విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ మాట్లాడాలని, అలాగే, ఎన్డీఏ కూటమిలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరూ అని అమిత్ షా ప్రకటించాలన్నారు.

బీజేపీ నేత కాత్యాయణికి సత్కారం

వేలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బీజేపీ నాయకురాలు కాత్యాయణిని వేలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు దశరథన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా నేతలతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పిచ్చాండి, ఉపాధ్యక్షుడు మణికంఠ, మహిళా అధ్యక్షురాలు నిత్య పాల్గొన్నారు.

రక్తదాతలే రియల్ హీరోలు

- ప్రిన్స్ మహేష్‌బాబు జన్మదిన వేడుకల్లో వక్తలు


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకునే రక్తదాతలే రియల్ హీరోలని పలువురు వక్తలు కొనియాడారు. సెయింట్ థామస్‌మౌంట్ నజరేత్‌పురంలోని చెన్నై మహేష్ బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 9న సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఆదివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రక్తదాన శిబిరం నిర్వహించారు. రాఘవ- జయన్ చారిటబుల్ ట్రస్టు ఓఆర్జీ బ్లడ్‌గ్రూప్ నిర్వాహకులు, నల్లబాలి ఉదయకిరణ్, తిరుమలశెట్టి శివసాయి, మాలపాటి వసంత్, కిరణ్‌కుమార్, కందికట్టి రాహుల్, సీవీఎస్ సాకేత్‌రాం, టి. ధనహరి, అనంత్, సి.శ్రీను, వర్మ, లింగబాబు, చైతన్య, హర్ష, శ్రీహర్షతోపాటు 50 మందికిపై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వసంత్ మాట్లాడుతూ ప్రిన్స్ మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని వాస్తవమైన అభిమానాన్ని చూపేలా థియేటర్లలో చప్పట్ల కంటే ముందుగా జీవితాలను కాపాడే చేతులే మిన్న అని, చేతల ద్వారా నిరూపించిన మహేష్‌బాబు గుండె సమస్యలతో ఉన్న 4500 మంది చిన్నారులను ప్రాణం పోసిన రియల్ హీరో అని కొనియాడారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఎగ్మూర్: కుశక్కరై వీధి, నెహ్రూ జ్యోతి నగర్, కృష్ణదాస్ రోడ్డు, పార్క్ వీధి, శాస్త్రి నగర్, ఏకాంగిపురం వీధి, సెమ్మాత్తమ్మన్ కాలనీ, డీకాకుళం, స్ట్రారన్స్ రోడ్డు, ఒట్టేరి కొంత భాగం, స్ట్రారన్స్ కందస్వామి ఆలయ వీధి, కుక్స్ వీధి, మేడవాక్కం వీధి, ట్రస్ట్ స్క్వేయర్, వీపీ కాలని, చిన్నబాబు వీధి, ఒత్తవాడై వీధి, సీఆర్ గార్డన్ వీధి, తిరువిక వీధి, కామరాజ్ వీధి, ఎస్ఎస్ పురం, న్యూ మాణిక్యం వీధి, వెంకటరత్నం వీధి, చెల్లప్ప వీధి, ఎస్టారన్స్ రోడ్డు, నారాయణ ముదలి వీధి, హనుమంతరాయన్ వీధి, వళ్లవన్ వీధి, సుబ్బరాయన్ మెయిన్ రోడ్డు, నల్లప్పనాయకన్ వీధి, చిన్నబాబు వీధి, భాష్యం రెడ్డి 1,2 వీధులు, సుబ్బరాయన్ వీధి, సందియప్పన్ వీధి, కుక్స్ రోడ్డు ప్రాంతం, న్యూ ప్రాన్స్ రోడ్డు, చోలయమ్మన్ తిరువిక వీధి, పొన్నియమ్మన్ వీధి, పొన్నై వీధి, చెల్లప్ప వీధి

షోలింగనల్లూర్: చిట్లపాక్కం జయ నగర్, వళ్లువర్ నగర్, మాంబాక్కం మెయిన్ రోడ్డు, టీవీ నగర్, మహేశ్వరి నగర్, టీఎన్‌హెచ్‌బీ కాలని, ప్రియదర్శిని నగర్, ఒట్టియంబాక్కం మెయిన్ రోడ్డు, మాడంబాక్కం, కోవిలంజేరి మాంబాక్కం మెయిన్ రోడ్డు, అగరం మెయిన్ రోడ్డు, నూత్తంజేరి, మగిల్చి నగర్, బాలా గార్డన్, తెర్క్ మఠం, గాంధీ నగర్

కోడంబాక్కం: ట్రస్ట్ పురం, ఆర్కాడు రోడ్డు పవర్ హౌస్ నుంచి రైల్వే ట్రాక్ వరకు, ఇన్నరాజపురం, వన్నియర్ వీధి, భజన ఆలయ వీధి, వరదరాజపేట మెయిన్ రోడ్డు, కామరాజన్ నగర్, రంగరాజపురం, పరంకుశపురం, అజీస్ నగర్, ఆత్రేయపురం, ఆండవర్ నగర్ ఫేస్-1, సర్క్యులర్ రోడ్డు, సౌరాష్ట్ర నగర్, శంకరాపురం, చూలైమేడు, గిల్ నగర్, వీఓసీ 1 నుంచి 5 వీధులు, దురైస్వామి రోడ్డు, సుబ్బరాయన్ వీధి, కామరాజర్ కాలనీ 1 నుంచి 8 వీధులు, అళగిరి నగర్ మెయిన్ రోడ్డు, గంగైఅమ్మన్ ఆలయ వీధి, పెరియార్ పాదై, పద్మనాభన్ నగర్, తమిళర్ వీధి, వళ్లలార్ వీధి, ఇళంగోవన్ వీధి, ఎతిరాజ్ వీధి, అయ్యప్ప నగర్, 100 అడుగుల రోడ్డు

చెట్‌పెట్: పుష్పా నగర్ స్లమ్ రీప్లేస్‌మెంట్ బోర్డు కొంత భాగం, వళ్లువర్ అపార్ట్‌మెంట్, కుశక్కరై రోడ్డు, కొత్తారి రోడ్డు, జయలక్ష్మీపురం మెయిన్ రోడ్డు, సీతానగర్ కొంత భాగం, వెస్ట్, సౌత్ మాడ వీధులు, జంబులింగం వీధి, కృష్ణన్ అయ్యర్ వీధి, స్టెర్లింగ్ రోడ్డు, వళ్లువర్‌కోట్టం హైరోడ్డు, కార్పొరేషన్ స్కూల్ రోడ్డు, లేక్ ఏరియా, కామరాజపురం సరోజి వీధి, విజయలక్ష్మి వీధి, సరస్వతి ఎక్స్‌టెన్షన్, బ్రౌన్ స్టోన్ అపార్ట్‌మెంట్, మహాలింగపురం మెయిన్ రోడ్డు మరియు వీధి, లేడి మాధవన్ రోడ్డు, సర్ మాధవన్ నాయర్ రోడ్డు, బాలట్ మాధవన్ వీధి, నాచ్చియమ్మన్ వీధి, వైకుంతపురం రోడ్డు, లయోలా కాలేజ్, రామనాయకన్ వీధి, కృష్ణమ్మాళ్ రోడ్డు, మేల్పాడి రోడ్డు, న్యూ వీధి, మాంగాడు స్వామి వీధి, జగన్నాధన్ వీధి, కుమరప్ప వీధి

రూ.1.17 కోట్ల విలువైన నగలతో ఇద్దరి అరెస్టు

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మదురై రైల్వేస్టేషన్‌లో రూ.1.17 కోట్ల విలువైన నగలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. మదురై రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి ఇద్దరు యువకులు ట్రాలీ బ్యాగుతో తిరుగుతుండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. వారి ప్రవర్తనపై సందేహించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో ఒకరు మహారాష్ట్రకు చెందిన హరిదాస్ సలుంగే (21) కోవిల్‌పట్టిలో నగల దుకాణం నడుపుతున్నాడు. మరొకరు కోవిల్‌పట్టి సెక్కడి వీధికి చెందిన సంతానరాజ్ (29)గా గుర్తించారు. బ్యాగులో రూ.500 కరెన్సీ నోట్లు, బంగారు నగలను గమనించి, మదురై ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు బ్యాగులో పరిశీలించగా రూ.72 లక్షల నగదు, రూ.41.22 లక్షల విలువైన 450 గ్రాముల బంగారు నగలు, 26 గ్రాముల వెండి నగలు మొత్తం రూ.1.16 కోట్ల విలువైన నగలు, నగదు ఉన్నట్లు గుర్తించారు. నగలు, నగదుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి దస్తావేజులు లేకపోవడంతో, అధికారులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

- పరువు హత్య కేసు..

కవిన్ తండ్రికి పోలీసు భద్రత



చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పాళయం కోట కేటీసీ నగర్‌లో జూలై 27న పరువుహత్యకు గురైన చెన్నై ఐటీ సంస్థ ఉద్యోగి కవిన్ సెల్వగణేష్ (27) తండ్రి చంద్రశేఖర్‌కు రాష్ట్ర ప్రభుత్వం సాయుధపోలీసు భద్రత కల్పించింది. తూత్తుకుడి జిల్లా ఏరల్ సమీపంలోని ఆరుముగమంగళం ప్రాంతంలో నివసిస్తున్న చంద్రశేఖర్ ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసు ఉన్నతాధికారులు ఆయనకు గన్‌మన్ ఏర్పాటు చేశారు. ఆయన ఏ ప్రాంతానికి వెళ్లినా ఆ సమాచారాన్ని ముందుగా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తారని ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కూటమికోసం ఎవరూ మాట్లాడొద్దు

- మద్దతుదారులకు ఓపీఎస్ హితవు

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కూటమిపై ఎవరూ ప్రస్తావించొద్దని, నిబంధన ఉల్లంఘించే వారిపై క్రమశిక్షణా చర్యలుంటాయని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మరణానంతరం జరిగిన అన్ని ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైందన్నారు. ప్రస్తుతం ద్రోహుల చేతుల్లో ఉన్న పార్టీని రక్షించేందుకు అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటుచేసి పోరాడుతున్నామన్నారు. అందుకు న్యాయస్థానం, ప్రజల మనస్సుల్లో మనకు విజయం లభిస్తుందనే నమ్మకంతో ఉన్నామన్నారు. రానున్న శాసనసభ ఎన్నికలను మనం ఎదుర్కొనేలా ఎంజీఆర్, జయలలిత అందించిన ప్రజా పాలన ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి ఏర్పాటుపై పార్టీ సీనియర్ నేతలు, జిల్లా కార్యదర్శుల అభిప్రాయాలు స్వీకరించి నిర్ణయం తీసుకుంటామని ఓపీఎస్ తెలిపారు.

ప్రాచీన విష్ణుమూర్తి విగ్రహం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి ఓడరేవు నుంచి శ్రీలంకకు సముద్ర మార్గం ద్వారా తరలించేందుకు యత్నించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్న క్రైంబ్రాంచ్ పోలీసులు వారినుంచి పురాతన విష్ణుమూర్తి పంచలోహ విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో క్రైమ్ బ్రాంచ్ సీఐ విజయ అనిత నేతృత్వంలో తూత్తుకుడి ఓడరేవు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో శ్రీలంకకు తరలించేందుకు ఇద్దరు వ్యక్తులు తీసుకొచ్చిన విష్ణుమూర్తి విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని ఏరల్ ప్రాంతానికి చెందిన ఆంథోని రాజ్ (52), బాలమురుగన్ (32)లను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న విష్ణుమూర్తి పంచలోహ విగ్రహం అంతర్జాతీయ మార్కెట్ కొన్ని కోట్ల విలువ ఉంటుందని, అందువల్ల శ్రీలంకకు తరలించి ఇక్కడి నుంచి విదేశాలకు ఓ ఏజెంట్ ద్వారా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తెలిసింది.

విద్యార్థినులకు కరాటే శిక్షణ



పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతిద): ఆపత్కర సమయాల్లో తమను తాము రక్షించుకునేలా విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం, కళ్లకుర్చి జిల్లాలోని పలు పాఠశాలల్లో కరాటే శిక్షణ ప్రారంభమైంది. రంగప్పనూరు పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాలలో శనివారం కరాటే శిక్షణను పాఠశాల ప్రిన్సిపాల్ మలర్‌కొడి ప్రారంభించారు. కరాటే మాస్టర్ ఏలుమలై విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇచ్చారు.

బావిలో శవంగా తేలిన విద్యార్థి


ముకిలన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరులో ఉన్న ప్రైవేటు పాఠశాల హస్టల్ విద్యార్థి రెండు రోజులపాటు అదృశ్యమై, ఆ పాఠశాల బావిలో ఆదివారం ఉదయం శవంగా తేలాడు. నాట్రాంపల్లి సమీపంలోని కొత్తూరు గ్రామ నివాసి చిన్నతంబి కుమారుడు ముకిలన్ (16) తిరుపత్తూరులోని డోమినిక్ సేవియో మహోన్నతపాఠశాలలో ప్లస్-1 చదువుతున్నాడు. ఆ పాఠశాలకు పక్కనే ఉన్న హస్టల్ గదిలో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం హస్టల్ నుంచి స్కూలుకు వెళ్ళిన ముకిలన్ తిరిగి రాలేదు. ఇంటికి వెళ్ళలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపత్తూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ బాలుడి ఆచూకీ కోసం అన్ని చోట్లా వెదికారు. హస్టల్ వద్దనున్న సీసీ పుటేజీ పోలీసులు పరిశలించగా ఓ వీడియోలో ముకిలన్ హస్టల్ గది వెనుకనున్న ఓ బావివైపు వెళ్తుండటం కనిపించింది. దీనితో ఆదివారం ఉదయం పోలీసులు ఇనుపకమ్మీల పైకప్పుతో ఉన్న ఆ బావి దగ్గరకు వెళ్ళి చూడగా ముకిలన్ అందులో శవంగా పడి ఉండటం కనిపించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందిని రప్పించి బావిలో నుండి మృతదేహాన్న వెలికి తీశారు. ఇనుప కమ్మీల మూత కలిగిన ఆ బావిలో ముకిలన్ ఎలా దూకి ఆత్మహత్య చేసుకున్నాడనే విషయమై పోలీసులు ముమ్మర దర్యాప్తు జరుపుతున్నారు.

కున్నూర్ వద్ద నల్ల చిరుత



పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కోతగిరి, కున్నూర్ ప్రాంతాల్లో చిరుత పులులతో పాటు నల్ల చిరుత సంచరించడం ఆ ప్రాంత ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కున్నూర్ నుంచి అళక్కరై వెళ్లే దారిలోని తేయాకు తోటలో శనివారం సాయంత్రం నల్ల చిరుత సంచరించడం తోటలో పనిచేస్తున్న కార్మికులు గుర్తించారు. సాధారణంగా జనావాస ప్రాంతాలకు రాని నల్ల చిరుతలు, ప్రస్తుతం తేయాకు తోటల్లో తరచూ సంచరిస్తున్నాయని కార్మికులు తెలిపారు. కొందరు కార్మికులు నల్ల చిరుత సంచరించే దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

మదనపల్లెలో బుద్ధుడి విగ్రహం ధ్వంసం


మాట్లాడుతున్న డీపీఐ నేత తిరుమావళవన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలో ఉన్న కొండపై బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన శక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల నుంచి మదనపల్లెలో బుద్ధ పూర్ణిమ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీపీఐ ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారని, ఆయనను రాజకీయంగా ఎదుర్కొలేక కొంతమంది ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఆ సంఘటనను ఖండిస్తూ ఆందోళనకు దిగిన శివప్రసాద్‌పై కేసులు నమోదు చేయడం గర్హనీయమన్నారు. బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చర్యలను ఖండిస్తూ ఆగస్టు 23 న విజయవాడలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీపీఐ పార్టీ నిర్వాహకులతో కలిసి ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో పార్టీ నేతలు బాలసింగం, వన్నియరసు, పీటీఎం శివప్రసాద్, యూ.గణపతి తదితరులు పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల సంఘు వార్షికోత్సవం



వేదికపై మాట్లాడుతున్న నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా బీమా ఉద్యోగుల సంఘ 38వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగింది. వేలూరులోని బీడీఎం మహల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అఖిల భారత ఇన్సూరెన్స్ ఉద్యోగుల కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా, వేలూరు జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ ఎస్.రామన్ పాల్గొన్నారు. అనంతరం మాజీ పూర్వ నిర్వాహకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వేలూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి పళనిరాజ్ అధ్యక్షతన అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపత్తూరు, రాణిపేట, తిరువణ్ణామలై, విల్లుపురం సహా పలు జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి దుర్మరణం

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతిద): కిందపడిన బైక్ తాళాలు తీసుకునే ప్రయత్నంలో కాలేజీ విద్యార్థి విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన కడలూరు జిల్లాలో శనివారం జరిగింది. చిదంబరం సమీపం కూత్తన్‌కోయిల్ ప్రాంతానికి చెందిన వినోద్ (17) సి.ముట్లూరు ప్రాంతంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం అమ్మాపేట నుంచి వినోద్ ద్విచక్రవాహనంలో వస్తుండగా, బైక్ తాళాలు కిందపడ్డాయి. బైక్ నుంచే తాళాలు తీసుకొనేలా సమీపంలో ఇనుప పైప్‌ను పట్టుకున్నాడు. అప్పటికే ఆ పైప్ విద్యుత్ తీగ తగిలి ఉండడంతో, వినోద్ పట్టుకున్న వెంటనే విద్యుదాఘాతానికి గురైయ్యాడు. చుట్టుపక్కల వారు అతడిని రక్షించి చిదంబరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు., ఈ ఘటనపై అన్నామలై నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పీఎంకే నేత అరెస్టును ఖండిస్తూ రాస్తారోకో


రాస్తారోకోలో పాల్గొన్న పీఎంకే శ్రేణులు

ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా పీఎంకే ఉపాధ్యక్షుడు మందిరి పడయార్చి అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు పెన్నాగరం ప్రాంతంలో రోడ్డుపై బైటాయించి ఆందోళనలో పాల్గొన్నారు. హొగెనెకల్‌లో జరిగిన ఆడిపెరుక్కు వేడుకల్లో పాల్గొన్న వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం పీఎంకేలో తండ్రీకొడుకుల మధ్య పదవుల పోరాటం జరుగుతోందని విమర్శలు చేశారు. దీంతో మంత్రిపై ఆగ్రహం చెందిన పీఎంకే ధర్మపురి జిల్లా ఉపాధ్యక్షుడు మందిరి పడయార్చి మంత్రిని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్లు స్థానిక డీఎంకే నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం ఉదయం పోలీసులు అరెస్టు చేసిన మందిరి పడయార్చిని విడుదల చేయాలని కోరుతూ సుమారు 200 మందికి పైగా కార్యకర్తలు పెన్నాగరం రోడ్డుపై బైటాయించి రాస్తారోకోలో పాల్గొన్నారు.

దోనె బోల్తా: ఇద్దరి మృతి

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలోని భవానీ సాగర్ నీటి మట్టం 101 అడుగులకు చేరడంతో సముద్రాన్ని తలపిస్తోంది. కోడెపాళయం గ్రామానికి చెందిన మణికంఠన్ (18), వడవల్లి ప్రాంతానికి చెందిన సురేష్ (38), సత్యమంగళం కరట్టూర్ ప్రాంతానికి చెందిన శక్తి తదితరులు శనివారం ఉదయం దోనెలో వెళ్లారు. భవానీ సాగర్ డ్యాం పరీవాహక ప్రాంతంలోని ఒత్తపాళైమరక్కాడు ప్రాంతంలో నీటిలో మునిగిన అరటి గెలలను నరికి దోనెలో వేసుకుని వాల్‌కరాడు వైపు బయల్దేరారు. ఈ సమయంలో భారీ గాలులు వీయడంతో బరువు తట్టుకోలేక దోనె నీట మునిగడంతో అరటి గెలలతో పాటు ముగ్గురు నీటిలో మునిగారు. వారిలో శక్తి ఈదుకుంటూ తీరానికి చేరుకోగా, ఈత తెలియని సురేష్, మణికంఠన్ నీటమునిగి మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం



ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లోని 4వ ప్లాట్‌ఫారమ్‌పై శనివారం పడివున్న ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని పరిశీలించి అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. సుమారు 28 కిలోలతో ఉన్న ఈ ప్యాకెట్లను ఫ్లవర్ బజార్ పోలీసులకు ఆర్పీఎఫ్ సిబ్బంది అప్పగించారుజ ఈ గంజాయిని ఎవరు తరలించారన్న దానిపై రైల్వేస్టేషన్‌లోని సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

రూ.కోటి బీడీ ఆకుల స్వాధీనం

తూత్తుకుడి జిల్లాలోని సముద్ర మార్గంగుండా బీడీ ఆకుల, పసుపు కొమ్ములు తదితరాలను శ్రీలంకకు చట్టవిరుద్ధంగా తరలించే సంఘటనలు సీరియళ్ల కొనసాగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు కోస్టుగార్డులు, సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, సైబర్ క్రైమ్ పోలీసులు తూత్తుకుడి సమీపంలోవవున్న మనప్పాడు ఉత్తర సముద్రతీర ప్రాంతంలోని రహదారిలో కంటైనర్ లారీలను ఆపి తనిఖీ చేశారు. ఓ కంటైనర్‌లో శ్రీలంక తరలించడానికి ప్రమత్నించిన 35 కిలోల బరువున్న 85 బండిళ్ల బీడీ ఆకులను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.కోటి అని తెలిపిన పోలీసులు పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

శక్తి అమ్మ జన్మదినం సందర్భంగా క్రీడా పోటీలు



వేలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలో ప్రసిద్ధి చెందిన స్వర్ణ దేవాలయ పీఠాధిపతి శక్తి అమ్మ 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ పాల్గొని పోటీలను ప్రారంభించారు. అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

6న పరువుహత్యలకు నిరసనగా నిరాహారదీక్ష



- టీఎన్‌సీసీ ఎస్సీ విభాగం నేత రంజన్‌కుమార్


ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరువుహత్యలను అడ్డుకునేలా ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌తో ఈ నెల 6న నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్ పేర్కొన్నారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన ఎస్సీ విభాగం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని కాంక్షిస్తున్న డీఎంకే ప్రభుత్వం పరువుహత్యలను పూర్తిస్థాయిలో అడ్డుకునేలా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలనే డిమాండ్‌తో నిరాహరదీక్షను రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాటు తుపాకుల విక్రయం.. ఆరుగురి అరెస్ట్



వేలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలో వి.కోట అటవీ ప్రాంతాల్లో నాటు తుపాకులు తయారు చేసిన ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే వి.కోట అటవీ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్ రేంజర్ల శిక్షణా శిబిరంలో అధికారులు రౌండ్స్ నిర్వహిస్తున్న సమయంలో అడవిలో నుంచి తుపాకీ కాల్పుల శబ్దం వినిపించడంతో అటువైపు వెళ్లిన అటవీశాఖ అధికారులకు నాటు తుపాకులను తయారు చేసి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను చూసి వారిని అరెస్టు చేశారు. వారి నుంచి 4 నాటు తుపాకులు, 12 తూటాలను ఫారెస్ట్ రేంజర్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

నడిరోడ్డులో కారు దగ్ధం.. డ్రైవర్‌కు గాయాలు



తిరుత్తణి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి-తిరుపతి జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ కారు హఠాత్తుగా అగ్నిప్రమాదానికి గురికాగా, అందులో ప్రయాణిస్తున్న సూసై అనే వ్యక్తి గాయాలపాలైయ్యాడు. ఆదివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కారులో చెన్నై వెళ్తుండగా తిరుత్తణి జాతీయ రహదారిలోఉన్న సీఎస్ఐ చర్చి ప్రాంతానికి రాగానే కారు ముందు నుంచి పొగలు రావడాన్ని సూసై గుర్తించాడు. వెంటనే కారును రోడ్డు పక్కగా ఆపి, కారు నుండి దూరంగా వెళ్ళిపోయాడు. కారు దిగిన కొద్దిసేపటికే కారు పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే 90శాతం వరకు కారు దగ్ధమైంది. గాయపడిన సూసైని ఆస్పత్రికి తరలించిన పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉంగళుడన్ స్టాలిన్'కు విశేష ప్రజాదరణ


- మున్సిపాల్ కౌన్సిల్ సభ్యురాలు సరస్వతి

తిరుత్తణి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కోసం సీఎం స్టాలిన్ నేతృత్వంలోని మంత్రివర్గం ప్రజలకు అందుబాటులో వుంటూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సరస్వతి భూపతి అన్నారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని మేట్టువీధిలో శనివారం ఉదయం 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారమవుతున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంకే పార్టీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలుశాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ద్రౌపది ఆలయంలో అగ్ని వసంతోత్సవ వేడుకలు

వేలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా తోటపాళయంలో కొలువైన ధర్మరాజస్వామి సమేత ద్రౌపది ఆలయంలో శనివారం రాత్రి అగ్ని వసంతోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో మొదలై 11 రోజుల పాటు జరుగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి శనివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. అదేవిధంగా నెల 10వ తేదీ అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించనున్నారు.

పుష్కర్, గాయత్రి దర్శకత్వంలో ఎస్కే



పుష్కర్, గాయత్రి - శివకార్తికేయన్

వరుస చిత్రాల్లో నటిస్తున్న హీరో శివకార్తికేయన్ తన కొత్త చిత్రంలో పుష్కర్, గాయత్రి ద్వయం దర్శకత్వంలో నటించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. 'విక్రమ్ వేద' చిత్రంతో పుష్కర్ - గాయత్రి దర్శక ద్వయం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ఈ చిత్రం తర్వాత వారి సినిమా విడుదలకాలేదు. ఇపుడు శివకార్తికేయన్ చిత్రానికి దర్శకత్వం చేస్తుండగా, కొత్త ప్రాజెక్టు ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ ప్రాజెక్టుపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ, సినిమాకు సంబంధించిన పనులు మాత్రం మొదలయ్యాయి. ఇందులో నటీనటులు, లోకేషన్ల ఎంపిక జరుగుతున్నాయి. ఇదిలావుంటే, శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' చిత్రం వచ్చే నెల 5న విడుదలకానుంది. 'పరాశక్తి' చిత్రం సెట్స్‌పై ఉంది. ఆ తర్వాత 'డాన్' ఫేం సిబి చక్రవర్తి దర్శకత్వంలోనూ, వెంకట్ ప్రభు దర్శకత్వాల్లో నటించనున్నారు.

సూర్య సరసన భవానిశ్రీ



హీరో సూర్య సరసన యువ హీరోయిన్ భవానిశ్రీ నటించనున్నారు. తమిళం, తెలుగు భాషల్లో రూపొందనున్న ఈ చిత్రంలో ప్రధాన హీరోయిన్‌గా మలయాళ భామ మమిత బైజును ఇప్పటికే ఎంపిక చేయగా, ఇపుడు రెండో హీరోయిన్‌గా భవానిశ్రీని ఎంపిక చేశారు. ప్రస్తుతం వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'విడుదలై' మూవీలో హీరో సూరి సరసన నటించిన భవానిశ్రీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అతి తక్కువకాలంలో అగ్రహీరో సూర్య సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఈ మూవీలోని ఇతర పాత్రల్లో రాధిక, బాలీవుడ్ నటి రవీనా టాండన్ కీలక పాత్రలు పోషించనున్నారు. మరోవైపు, హీరో సూర్య 'రెట్రో' మూవీ తర్వాత ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో 'కరుప్పు' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఇందులో హీరోయిన్లుగా త్రిష, శ్వాసిక, షివదా నటిస్తున్నారు. ఈ మూవీ తర్వాత టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తన 46వ చిత్రంలో నటించనున్నారు.

ముగిసిన మదన్‌బాబ్ అంత్యక్రియలు

- కోలీవుడ్ ప్రముఖుల సంతాపం

గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచిన ప్రముఖ హాస్య నటుడు మదన్‌బాబ్ అంత్యక్రియలు ఆదివారం బీసెంట్ నగర్ శ్మశానవాటికలో పూర్తయ్యాయి. మరోవైపు మదన్‌బాబ్ మృతి పట్ల కోలీవుడ్ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతి వ్యక్తం చేశారు. అడయారులోని ఇంటిలో ఉంచిన మదన్‌బాబ్ భౌతికకాయానికి నడిగర్ సంఘం అధ్యక్షుడు, సీనియర్ నటుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, మాజీ ఎమ్మెల్యే, నటుడు ఎస్వీ శేఖర్‌లతో పాటు అనేక మంది సినీ ప్రముఖులు నివాళులర్పించారు. ఇదిలాఉండగా తమిళం, తెలుగు, మలయాళం తదితర భాషల్లో వందకుపైగా చిత్రాల్లో నటించిన మదన్‌బాబ్ తనకే సొంతమైన ప్రత్యేక నవ్వుతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. 1953లో చెన్నైలో జన్మించిన ఆయన సొంత పేరు కృష్ణమూర్తి. 'దేవర్ మగన్', 'ఫ్రెండ్స్', 'విలన్' వంటి అనేక సూపర్ డూపర్ హిట్ చిత్రాల్లో నటించారు.





మదన్‌బాబ్ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న నాజర్, ఎస్వీ శేఖర్




కమల్ హాసన్‌తో 'పార్కింగ్' చిత్ర బృందం

'పార్కింగ్' చిత్ర బృందానికి కమల్ అభినందన

చిత్రజ్యోతి

మూడు జాతీయ అవార్డులను కైవసం చేసుకున్న 'పార్కింగ్' చిత్ర బృందాన్ని అగ్ర నటుడు, రాజ్యసభ సభ్యుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ చిత్ర బృందాన్ని ఆదివారం తన కార్యాలయానికి ఆహ్వానించి ప్రతి ఒక్కరినీ ప్రశంసల్లో ముంచెత్తారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో 'పార్కింగ్' బృందం ఏకంగా మూడు అవార్డులను దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర బృందాన్ని కమల్ హాసన్ స్వయంగా తన కార్యాలయానికి ఆహ్వానించి ప్రత్యేకంగా అభినందించడం గమనార్హం.

అజిత్ సినీ కెరీర్‌కు 33 యేళ్ళు



అగ్రహీరో అజిత్ కుమార్ 33 యేళ్ళ సినీ కెరీర్ పూర్తి చేసుకున్నారు. ఈ శుభ సందర్భంగా '33ఇయర్స్‌ఆఫ్ అజిత్‌కుమార్' అనే పేరుతో ఒక హ్యాష్‌ట్యాగ్‌ను ఆయన అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అజిత్ కుమార్ 33 యేళ్ళ సినీ ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భంలో ఆయనతో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. అందులో '33 యేళ్ళ బ్యూటీఫుల్ జర్నీ. భర్తీచేయలేని మీ కఠోరశ్రమ, అరుదైన రత్నం. మిమ్మలను ప్రేమిస్తున్నాను సర్ అంటూ పేర్కొంటూ '33ఇయర్స్ ఆఫ్ అజితిజం' అంటూ ట్వీట్ చేశారు. కాగా, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి హిట్ చిత్రం తర్వాత అజిత్ - ఆధిక్ రవిచంద్రన్ కాంబినేషన్‌లో మరో చిత్రం రూపుదిద్దుకోనుంది. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటోంది. అక్టోబరు లేదా నవంబరులో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు.

కోలాహలంగా ఆడిపెరుక్కు

- కావేరి మాతకు ప్రత్యేక పూజలు
- డెల్టా జిల్లాల్లో పండగ సందడి



తిరువయ్యారు కావేరి నదీతీరంలో పుష్పమండపం వద్ద మహిళల సందడి



ఆడిపెరుక్కు సందర్భంగా కొల్లిడం వాగు వద్ద నటరాజస్వామి (ఇన్‌సెట్‌లో) శ్రీరంగంలో కావేరీ తీరంలో యువతికి బొట్టు పెడుతున్న మహిళ



తిరుచ్చి వద్ద నదీ తీరంలో పూజలు చేస్తున్న మహిళలు

ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కావేరి నదీ పరీవాహక ప్రాంతం హొగెనేకల్ నుంచి పూంపుహార్ వరకు డెల్టా జిల్లాలు, తీరప్రాంతాల ప్రజలంతా మరో పుష్కరంగా భావించే ఆడిపెరుక్కు వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ముత్తైదువులు, నవ వధువులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డెల్టా జిల్లాల మీదుగా ప్రవహించి రైతులు, ప్రజల అవసరాలు తీరుస్తున్న కావేరి మాతకు కూరగాయలు, పండ్లు, పూలు, నవధాన్యాలు సమర్పించారు. ఏటా ఆడి మాసంలో కావేరి నదికి కృతజ్ఞతలు తెలిపేలా ఈ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. తమిళ ఆడి (ఆషాఢ మాసం)లో 18వ రోజును ఆడిపెరుక్కుగా జరుపుకుంటారు. ప్రస్తుతం పొరుగు రాష్ట్రం కర్నాటకలో భారీవర్షాలు కురుస్తుండడంతో కావేరి నదిలో విడుదల చేస్తున్న జలాలు సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు చేరాయి. దీంతో ఈ ఏడాది ఆడిపెరుక్కు పూజలతో డెల్టా జిల్లాల్లో శనివారం నుండే సందడి నెలకొంది. ఆదివారం ఉదయం పెద్దసంఖ్యలో తరలివచ్చిన స్థానికులు కావేరీ తీరంలో సూర్య నమస్కారాలతో పూజలు నిర్వహించారు. డ్యాం వద్ద ఉన్న మున్నియప్పన్ విగ్రహానికి కోడి పుంజులను, మేకలను బలిచ్చి ఆ మాంసంతో వంటలు చేసి స్వామివారికి నివేదించారు. కావేరి తీరంలో వేదమంత్రోచ్చారణల మధ్య కొందరు తమ పితృదేవతలకు తర్పణాలు వదిలారు. జిల్లాలోని పరీవాహక ప్రాంతాల్లో వేలాదిమంది భక్తులు, నవ దంపతులు పుణ్యస్నానాలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఆడిపెరుక్కు సందర్భంగా కొత్త మంగళసూత్రాలు ధరించారు. సకల సంపదలు కలుగాలని డెల్టా రైతులు ప్రార్థించారు. అలాగే, రాష్ట్రంలో కావేరి పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాలు, పుష్కర ఘాట్లకు భక్తులు పోటెత్తారు. పుష్కరఘాట్లలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా పుణ్యస్నానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు పహరాగా ఉన్నారు.



కావేరి కూట్టుతురై వద్ద పూజలు చేస్తున్న ఓ కుటుంబం

ఈరోడ్ జిల్లా.... : జిల్లాలోని కావేరి, భవాని నదుల సంగమం కూట్టుతురైలో తెల్లవారు జాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు గుమిగూడారు. మేట్టూరు డ్యాం నుంచి విడుదల చేసిన జలాలు కూడుదురైలో భారీస్థాయిలో చేరడంతో పొంగి ప్రవహించింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా పుష్కరఘాట్లలో బ్యారికేడ్లు ఏర్పాటుచేశారు. స్నానమాచరించిన అనంతరం సంగమేశ్వరుడు, వేదనాయకి అమ్మవారు, ఆదికేశవ పెరుమాళ్‌ను భక్తులు దర్శనం చేసుకున్నారు.

కడలూరు జిల్లా... : డెల్టా చివరి ఆయకట్టు ప్రాంతమైన చిదంబరం పరిసర ప్రాంతాలు, కొల్లిడం జలాశయంలో కొత్త దంపతులు తమ వివాహ సమయంలో ధరించిన మాలలు ప్రవాహంలో వదిలి కావేరి మాతకు పూజించారు. అలాగే తంజావూరు జిల్లా పూంపుహార్ సంఘమిత్ర ఘాట్ వద్ద ఆడిపెరుక్కు సందర్భంగా నిర్వహించిన పూజల్లో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మేట్టూరు జలాశయంలో భక్తుల స్నానాలు

సేలం జిల్లా... : జిల్లాలోని ఎడప్పాడి సమీపంలో ఉన్న బూలంపట్టి కావేరి నది కాలువ తీరంలోని పుష్కరఘాట్‌లో పసుపుతో రూపొందించిన వినాయకుడు, కావేరి మాత రూపాలు పెట్టి నెయ్యి దీపాలు వెలిగించి హారతులిచ్చి నూతన దంపతులు పూజలు నిర్వహించారు. అలాగే, మేట్టూరు డ్యాం పరిసరాల్లో మునియప్ప ఆలయంలో దర్శనం అనంతరం భక్తులు స్వామివారికిష్టమైన చేపల వంటలు నైవేద్యంగా సమర్పించారు. కన్నియాకుమారి జిల్లాలోని త్రిసంగమం, మేల్‌మలయనూరు ఆండాళ్ ఆలయం, చెన్నై బీసెంట్ నగర్ అష్టలక్ష్మి ఆలయం, మైలాపూర్ కపాలీశ్వర ఆలయం, తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయం, తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సురభి ఘాట్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, రైతులు తాము పండించిన పంటలను సూర్యభగవానుడికి నైవేద్యంగా సమర్పించి సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

కావేరి మాతకు రంగనాథుడి సారె...

తిరుచ్చి జిల్లా శ్రీరంగం రంగనాథ స్వామి ఆలయం తరపున ఆడిపెరుక్కు పర్వదినం సందర్భంగా కావేరి మాతకు సారె సమర్పించే కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఉదయం 6.30 గంటలకు నంపెరుమాళ్‌ను బంగారు పల్లకీలో అమ్మ మండపం పుష్కర ఘాట్‌కు ఆలయ పూజారులు ఊరేగింపుగా తీసుకురాగా. 11 గంటలకు స్వామివారికి తిరుమంజనం నిర్వహించి ఆలయం తరపున పట్టువస్త్రాలు, మంగళ సూత్రం, పసుపు కుంకుమ తదితరాలను కావేరి నదిలో వదిలారు.

ఘనంగా అన్నకూట మహోత్సవం



అన్నకూట మహోత్సవంలో ఊటుకూరు శరత్‌కుమార్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆడిపూరం, ఆడిపెరుక్కు పర్వదినాలను పురస్కరించుకుని షావుకారుపేట రెడ్డిరామన్ వీధిలో ఉన్న నంబూరు వెంకటసుబ్రమణ్యం చెట్టి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అన్నకూట మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రీరామకృష్ణ చైతన్య మందిరాన్ని, దేవతా మూర్తులన అలంకరించారు. మహామంత్ర భజన బృందం ఆలపించిన భక్తిగీతాలు, గోవింద, రామ నామ స్మరణతో వేదిక మారుమోగింది. మహాభిషేకం, దీపారాధన అనంతరం ఆలయ ప్రాంగణంలో 102 కేజీల అన్న రాశిని స్వామివారికి నివేదించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఎస్కేపీడీ ట్రస్టీ ఊటుకూరు శరత్‌కుమార్, కార్యక్రమ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుట్రాలం జలపాతం వద్ద పర్యాటకుల సందడి



పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కుట్రాలం జలపాతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో కుట్రాలం ప్రధాన జలపాతం, పాత జలపాతం, పులిఅరువి, సిట్రరువి తదితర అన్ని జలపాతాల వద్ద నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, జిల్లాలకు చెందిన పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పిల్లలు, మహిళలు, పురుషులు జలపాతాల వద్ద స్నానం చేస్తూ, సెల్ఫీ తీసుకుంటూ సందడిగా గడిపారు. కార్లు, బస్సుల్లో వస్తున్న ప్రయాణికులు పాత కుట్రాలం నుంచి ప్రధాన జలపాతం వరకు ఉన్న ప్రైవేటు తోటల్లోని చెట్ల కింద వంటలు వండుకుని అక్కడే భోజనాలు చేశారు. పర్యాటకుల రాకతో వ్యాపారాలు పెరగడంతో ఆటు దుకాణదారులు, చేపలు పట్టే వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.

కృత్రిమ దంతాల ఏర్పాటులో విప్లవాత్మకమైన మార్పులు

- ఐఏఓఐ సదస్సులో వక్తలు

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దంత వైద్యంలో దంతాలను అమర్చే విధానాల్లో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని ఐఏఓఐ అంతర్జాతీయ సదస్సులో వక్తలు పేర్కొన్నారు. నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం ప్రారంభమైన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటోలజిస్ట్స్ అంతర్జాతీయ సదస్సులో అసలైన దంతాలను తలపించేలా కృత్రిమ దంతాలను అమర్చటం కూడా ఓ అందమైన కళనని వక్తలు పేర్కొన్నారు. ఈ సదస్సును తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ నారాయణస్వామి ప్రారంభించారు. శ్రీలంక ఆరోగ్యవిభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చందన గజనాయికే, రాగాస్ డెంటల్ కాలేజీ ఛైర్మన్ డాక్టర్ కనకరాజ్, డాక్టర్ శివశంకర్, డాక్టర్ జాన్సన్ రాజా జేమ్స్, డాక్టర్ జాన్ నేసన్, డాక్టర్ ధ్యానేశ్వరన్ ప్రసంగించారు. దేశ విదేశాల నుండి 400 మంది కృత్రిమ దంతాలను అమర్చే చికిత్సకు సంబంధించిన వైద్యనిపుణులు హాజరయ్యారు.



సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

ఎన్‌ఎల్‌సీ భద్రతా సిబ్బందికి కశ్మీర్‌లో శిక్షణ



కశ్మీర్ లోయలో ఎన్ఎల్‌సీ భద్రతా సిబ్బంది

పెరంబూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రతను బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా, కశ్మీర్‌లోని భారత సైనిక శిబిరంలో ఎన్ఎల్‌సీ, సీఐఎస్ఎఫ్ జవాన్లకు ప్రత్యేక ఆయుధ శిక్షణ ఇస్తున్నారు. కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి అనంతరం, దేశంలోని పార్లమెంటు భవనం, అణు విద్యుత్ కేంద్రాలు సహా పలు ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ భద్రతా విధుల్లో పాల్గొనే కేంద్ర పారిశ్రామిక బలగాలకు ఉగ్రవాద దాడులు, డ్రోన్ దాడులు, దేశీయ కుట్రలను ఎదుర్కొనేలా సైన్యంతో కలిసి ఉమ్మడి శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణలో తొలివిడతగా ఎన్ఎల్‌సీ వద్ద బందోబస్తులో ఉన్న 10 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లకు కశ్మీర్ లోయ లోని భారత సైనిక స్థావరాల్లో ఆయుధ శిక్షణ అందిస్తున్నారు.



స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలై వర్ధంతి సందర్భంగా గిండిలోని ఆయన విగ్రహం, చిత్రపటం వద్ద అన్నాడీఎంకే తరపున నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు డి.జయకుమార్, పొన్నయ్యన్, గోకుల ఇందిరా, మాజీ ఎంపీ తంబిదురై తదితరులు

నేత్రపర్వంగా సెయింట్ ఆంథోని చర్చి రథోత్సవం



ప్యారీస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం జిల్లా నాగూర్ సమీపంలో బోధంగుడిలో పురాతనమైన సెయింట్ ఆంథోని చర్చి వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. నాగూర్ బిషప్ ఆరోగ్యస్వామి నేతృత్వంలోని విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంలో మేరీమాత, ఆంథోయార్ విగ్రహాలను కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

సేలంలో 'బ్రిలియన్స్ డైమండ్స్ జ్యువెలరీ' షో



'బ్రిలియన్స్ డైమండ్స్ జ్యువెలరీ' ప్రారంభోత్సవంలో కొత్త డిజైన్ నగలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు, మగువలు

అడయార్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సేలంలో ప్రముఖ వజ్ర, బంగారు ఆభరణాల షోరూమ్ జోయాలుక్కాస్ 'బ్రిలియన్స్ డైమండ్స్ జ్యువెలరీ' పేరుతో ఒక ప్రదర్శన ఏర్పాటుచేసింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి 17 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగనుంది. ఇందులో లక్ష రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో వజ్రాభరణాలను కొనుగోలుచేసే కస్టమర్లకు గ్రాము బంగారం నాణెం గుర్తుగా ఇస్తామని జోయాలుక్కాస్ గ్రూపు ఛైర్మన్ డాక్టర్ జోయాలుక్కాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందులో రాచరికపు వివాహ కలెక్షన్ల నుంచి చిక్ సమకాలీన డిజైన్ల వరకు ఇందులో ఉంచామని వెల్లడించారు. ఈ డిజైన్లు పరిమితకాలంలో నిర్వహించే ప్రదర్శనలో మాత్రమే అందుబాటులోకి ఉంటాయని ఆయన పేర్కొన్నారు.